
10022025-DIS-04_Layout 1 2/10/2025 3:21 AM Page 1



# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



# చాణక్యుని రాజనీతి సూత్రాలు

భారత ఉపఖండంలోని ఎక్కువ భూభాగాన్ని పరిపాలించిన మొదటి రాజవంశం మౌర్యవంశం (క్రీ.పూ.322–185). ఈ వంశ తొలి రాజైన చంద్రగుప్త మౌర్యుడిని మహా పరాక్రమవంతుడైన రాజుగా తీర్చిదిద్దినవాడు చాణక్యుడు (క్రీ.పూ.350–275). చాణక్యుడనగానే చాలామందికి వెంటనే అర్థశాస్త్రం గుర్తొస్తుంది. కానీ, రాజ్య పాలన ఎలా ఉండాలో చెప్తూ రాజనీతి సూత్రాలను కూడా ఆయన రచించాడు.

ఈ చాణక్యుడు తన శిష్యుడైన చంద్రగుప్త మౌర్యుడి కోసం రాజ్యాన్ని ఎట్లా పరిపాలించాలో, ఎట్లా కాపాడుకోవాలో తెలియజెప్పడానికి ఆరు వేల శ్లోకాలతో 'అర్థశాస్త్రమ్' (రాజకీయ దండనీతి) అనే ఉద్గ్రంథాన్ని రచించాడు. ఆనాటి రాచరిక వ్యవస్థ, సమాజం కోసం వివిధ శాస్త్రాల నుంచి సేకరించిన 332 శ్లోకాలతో ఒక సంకలనం గ్రంథం వెలువరించాడు. అది 'చాణక్యుని నీతిశాస్త్రమ్'గా ప్రసిద్ధి పొందింది.

'ఏకాకి నా తపో ద్వాభ్యాం పఠనం..'/ ఒంటరిగా తపస్సు, చదువు ఇద్దరు కలిసి, గానం ముగ్గురు కలిసి, ప్రయాణం నలుగురు కలిసి చేయాలి అనీ 'అత్యాసన్నా వినాశాయ... రాజా వహ్ని ర్గురుః స్త్రియః'/ రాజుఅధికారికీ, నిప్పుకూ, స్త్రీకి దగ్గరగా ఉండకూడదు. అట్లాగని మరీ దూరంగా ఉండకూడదు. మధ్యస్థంగా ఉండి వారిని సేవించాలి. లేకుంటే నష్టపోతాము. అంటూ హితనీతి బోధలూ, జాగ్రత్తలూ అనేకం చెప్పినాడు.

**చాణక్య విరచితాలుగా 'అర్థశాస్త్రమ్' చాణక్యుని నీతిశాస్త్రంతో పాటుగా 'చాణక్య రాజనీతి సూత్రాణి' (చాణక్య రాజనీతి సూత్రాలు) అనే గ్రంథమూ ఉంది. 'ఈ చాణక్య రాజనీతి సూత్రాలు' అనే చిరు గ్రంథంలో ఎనిమిది అధ్యాయాలూ, 562 సూత్రాలూ కనిపిస్తున్నాయి.**

'సుఖస్య మూలం ధర్మః'/ ధర్మమే సుఖానికి మూలం అంటూ ప్రారంభమయ్యే ఈ చాణక్య గ్రంథంలోని ప్రథమాధ్యాయంలో 'అర్థ సంపత్ ప్రకృతి సంపదం కరోతి' అర్థ సంపదే ప్రకృతి సంపదను ఇస్తుందంటూ– అమాత్యులు, మిత్రులు, కోశాగారం, రాష్ట్రం, దుర్గం, సైన్యం ఈ ఆరింటినీ రాజ్య ప్రకృతులని పేర్కొన్నాడు. అమ్యాతులను, మిత్రులనూ పరీక్షించి చేరదీసుకోవాలనీ, రాజు దుర్వ్యసనాలకు లొంగకూడదనీ, దండనాన్ని వివేకంగా ప్రయోగించాలని చెప్తాడు.

రెండవ అధ్యాయంలో 'అర్థమూలం సర్వకార్యం'/అన్ని పనులూ కావాలంటే ధనమే మూలమంటూ, అది ఉంటే స్వల్ప ప్రయత్నంతోనే పనులు జరిగిపోతాయంటాడు. రాజైనవాడు మంచి నడవడికను ఏనాడూ విడవవద్దని 'ప్రాణాదపి ప్రత్యయో రక్షితవ్యః' రాజు తన ప్రాణాల కన్న మిన్నగా ప్రజా విశ్వాసాన్ని రక్షించుకోవాలని హితవు చెప్తాడు.

మూడవ అధ్యాయంలో 'బాలాదపి యుక్త మార్గం శృణుయాత్'/ అర్థవంతమైన మాటను బాలుడు చెప్పినా వినాలి అంటాడు. సత్పురుషుల అభిప్రాయాన్ని దాటకూడదనీ, రాజులకు పరాక్రమమే ధనమనీ, శత్రువు చేతికి చిక్కినా అతడిని నమ్మకూడదనీ, ధన సేకరణలో శత్రు ప్రమేయమం ఉండొద్దనీ, ఎవరినీ, ఎప్పుడూ... అవమానించకూడదంటాడు. చాలా పనులున్నప్పుడు ఎక్కువ ఫలాన్నిచ్చే పనినీ, భవిష్యత్తులో లాభించే పనిని చేయమని చెప్తాడు.

**నాలుగవ అధ్యాయంలో 'ధర్మేణ కార్యతే లోకః'/ధర్మమే లోకాన్ని నిలబెడుతుందనీ, పరుల సంపద మీద ఆసక్తి చూపవద్దనీ, పరద్రవ్యమైన గింజలేని పొట్టును కూడా హర్షించవద్దనీ, ధాన్యమే ధనమనీ, ఆకలి వంటి శత్రువు లేడంటూ 'సంసది శత్రుం న పరిక్రోశేత్'/ శత్రువుని సభలో గానీ, పది మందిలో గానీ, నిందిస్తూ అవమానించకూడదని నీతి బోధ చేస్తాడు.**

ఐదవ అధ్యాయంలో 'విద్యా ధన మధనానామ్' నిర్ధనులకు విద్యయే ధనమనీ 'ఇంద్రియాణాం ప్రశమం శాస్త్రమ్'/ ఇంద్రియాలకు శాంతిని ప్రసాదించేది శాస్త్రమనీ, ఇతరులలోని సద్గుణాలకు అసూయ చెందకూడదనీ, 'శత్రోరపి సుగుణోగ్రాహ్యః'/ శత్రువు నుంచి కూడా మంచి గుణం గ్రహింపతగినదంటాడు. జ్యోతిష్య శాస్త్రం కంటే శకునశాస్త్రం నమ్మతగినదనీ, పూజనీయుల్లో తల్లియే గొప్పదని చెప్తాడు.

ఆరవ అధ్యాయంలో 'అనుపద్రవం దేశమావసేత్ ఏ ఉపద్రవం లేని దేశంలో నివసించాలని, ఎప్పుడూ ప్రజలు రాజుకు భయపడాలనీ, రాజును మించి దేవుడు లేడనీ, 'రాజదాసీ నసేవితవ్య' రాజ్యాంతఃపురంలోని దాసితో సంబంధం పెట్టుకోకూడదనీ హెచ్చరిస్తాడు. 'కథంచి దపి ధర్మం నిసేవేత్' ఎంత కష్టపడైనా ధర్మబద్ధంగా బ్రతకాలని చెప్తాడు. 'నాస్తి సత్యాత్ పరం తపః' సత్యం కన్నా మించిన తపస్సు లేదంటాడు.

ఏడవ అధ్యాయంలో.. 'తపస్సార ఇంద్రియ నిగ్రహః'/ అని తపస్సుల్లో శ్రేష్ఠమైనది ఇంద్రియ నిగ్రహమనీ, చేయవలసిన పనులను తెల్లవారు జామున ఆలోచించాలని సూచిస్తాడు. 'ఆత్మాన స్తోతవ్యః' / తమకు తామే ఎప్పుడూ పొగుడుకోకూడదని అంటూ, పగలు నిద్రపోకూడదనీ హితవు చెబుతాడు. ఎండమావులు నీరు వలె కనబడినట్లుగా 'శత్రుర్మిత్ర వద్భాతి' / శత్రువు కూడా మిత్రుడి వలె కనబడతాడు సుమా అని హెచ్చరిస్తాడు.

ఇక చివరిదైన 8వ అధ్యాయంలో 'దుర్మేధసో సచ్ఛాస్త్రం మోహయతీ' మంచి శాస్త్రం చెడు మేధస్సు కలవాళ్లకు భ్రాంతి కలిగిస్తుందంటాడు. సత్పురుషులతో చేసే స్నేహం స్వర్గవాసం అనీ, దైవాధీనంగా ఉన్నదాని గురించి చింతించకూడదనీ, 'పుత్రో న స్తోతద్య' పుత్రుడిని స్తుతించకూడదనీ, 'ఆత్మచ్ఛిద్రం న ప్రకాశయేత్' తన లోపాన్ని లోకానికి తెలియనీయవద్దనీ చెప్తాడు 'వ్యవహారానులోమో ధర్మః' లోక వ్యవహారానికి అనుకూలంగా ఉండేదే ధర్మం అని సెలవిస్తాడు. యధార్థ స్థితిని తెలుసుకోవడమే శాస్త్రానికి ప్రయోజనమని అంటాడు. రహస్యంగా పాపాలు చేసేవాళ్లకు పంచభూతాలే సాక్షులు అనీ, సృష్టిలో ప్రతిదీ అనిత్యమైనదనీ, 'జన్మ మరణాదిషు తు దుఃఖమేవ'/ జనన మరణాలతో దుఃఖమే గానీ సుఖం లేదనే చేదు నిజాన్ని గుర్తుచేస్తాడు. ఈ విధంగా చాణక్యుడి ఈ 'రాజనీతి సూత్రాలు'లో రాచరికానికి పనికి వచ్చే సూత్రాలతో పాటు, సామాన్య ప్రజలకు ఉపయోగపడే నీతిసూత్రాలూ ఉన్నాయి. 'అహింసా లక్షణో ధర్మః' (మనో వాక్కాయకర్మలతో ఇతరులెవరినీ హింసించకుండా ఉండటమే ధర్మానికి లక్షణం) అనే చాణక్యుని నీతి సూత్రంలో ఈ పరిచయ వ్యాసాన్ని ముగిస్తున్నాను. ■



రఘువర్మ
(టీయల్యన్)
92900 93933



## చూపు

చాలా ఏండ్ల తర్వాత
మా వూరికెళ్లాను
మా యిల్లు చిన్నగా కనిపిస్తున్నది
మూడు గదుల ఇల్లే అయినా
ముల్లోకాలంత పెద్దగా వుండేది.

మా బల్ల మీద వొరిగి పడుకొని
మూడు వేల పుస్తకాలు చదివాను
బల్ల వైశాల్యం ఎకరాలుగా విస్తరించేది

ఇంటి ముందు చెట్టు
ఇప్పటికి వుంది
దాని పైకెక్కి
చింతచిగురు తెంపేవాణ్ని
ఇప్పుడా ప్రాంగణమంతా
ఇరుకిరుగ్గా అనిపిస్తున్నది.

మా గోడల
జాజుపూతలు
సహజ చిత్రకారుని
కుంచె నుంచి జాలువారినట్టుగా ఉండేవి
ఇప్పుడవి మోటుగా ఉన్నాయి.

నగరంలో ఇల్లు కట్టినప్పుడు
పాత జ్ఞాపకాల ఇటుకల్తోనే కట్టించాను
ఈ మధ్య అది కూడా
చిన్నగా కనిపిస్తుంది.

ఎవరైనా కలిస్తే
మీ ఇల్లు ఎంత పెద్దది అని అడుగుతున్నాను
సైజు రోగం పట్టుకుంది నాకు
నాలో ఏదో మానసిక రుగ్మత ఆవరించింది.

అయితే
ఎంతో ప్రపంచం తిరిగొచ్చిన తర్వాత
ఇంట్లో అమ్మను చూస్తే మాత్రం
ఏ ప్రమేయమూ లేని
ఉజ్వల కాంతి వెలుగుతుంది
ఆమె ఒడిని మించిన
విస్తీర్ణం ఎక్కడా లేదని తెలుసుకున్నాను.



డాక్టర్
ఎన్.గోపి



## ఈ శిక్ష మాకొద్దు

***సామాజిక, రాజకీయ, ఆర్థికాంశాలపై పలు పత్రికలకు వ్యాసాలు, కవితలు, పుస్తక సమీక్షలు రాసే రచయిత బద్రి నర్సన్‌లో కథలు రాసే కోణం కూడా ఉన్నదని నాకు మెల్లిగా తెలిసింది. తెలిసిన వెంటనే ఆయన రాసిన తొలి కథల పుస్తకం 'దారి తెలిసిన మేఘం' చదివాను. అందులో ఉన్న కథలు చదివాక రచయితతో ముచ్చట్లు పెట్టాలనిపించింది. అందులో భాగంగానే ఈ ఇంటర్వ్యూ. నేనేం అడిగానో, రచయిత బద్రి నర్సన్ ఏం చెప్పారో కింద ఉన్న ప్రశ్న, జవాబుల్లో తెలుసుకుందాం.***

**ప్రశ్న: పలు పత్రికల్లో వివిధ అంశాలపై మీ వ్యాసాలు వస్తుంటాయి. మీరు కథలు కూడా రాస్తారా?**

జవాబు: ఇది సాధారణంగా నేను ఎదుర్కొనే ప్రశ్ననే. గత పదేండ్లుగా పత్రికలకు వ్యాసాలు రాస్తున్నప్పుడు వాటిలో కొన్ని సంఘటనలు, సందర్భాలు కథలకు సరిగ్గా సరిపోతాయనిపిస్తుంటుంది. పుస్తక సమీక్షలు, సామాజిక, రాజకీయ అంశాలపై వ్యాసాలు రాస్తున్నా... కథగా మలచాలనిపించే సందర్భాలు నన్ను వెంటాడుతాయి. ఇంతకాలంగా ఎడిట్ పేజీలకు తోడు ఆదివారం పత్రికలకు కూడా ఎన్నో వ్యాసాలు రాశాను. మరి కథలు రాస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందా? రాశాక ఎవరూ వేసుకోకపోతే వాటిని ఏం చేసుకోవాలనే సందిగ్ధం కొంత వెనక్కి లాగేది.

**ప్ర: ఈ సందిగ్ధంలో మీ కథా ప్రయాణం ఎలా మొదలైంది?**

జ: కవిత్వంలో శ్రీశ్రీని, వచనంలో చలంను ఇష్టపడే మధ్య తరానికి చెందినవాడిని. కథ రాస్తే కొత్తగా, భిన్నంగా ఏదైనా రాయాలనిపించేది. ధైర్యం చేసి మొదటి కథ 2016లో రాశాను. అదే ఈ సంపుటిలో ఉన్న 'ఎంగిలి' అనే కథ. ఈ కథను ఒక పత్రికకు పంపితే మూణ్నెళ్ల తర్వాత ఫోన్ చేసి ఓ మాట చెప్పారు. 'దీన్ని వేస్తే ఇన్నాళ్ల నీ పరువుతో పాటు మా పత్రిక పరువు కూడా పోతుంది' అని. షాక్ తిన్నాను. అంత ఘోరంగా రాశానా అని తికమక పడ్డాను. అయినా ఎందుకో ఆ కథ మాయలో పడిపోయాను. సెకండ్ ఒపీనియన్‌గా మరో పత్రికకు పంపాను. కథ అచ్చయింది. ఉదయం నుంచే ఫోన్‌కాల్స్ మొదలయ్యాయి. అందరూ కథ కొత్తగా, గమ్మత్తుగా ఉన్నదన్నవారే కానీ, ఎవరూ తప్పుబట్టలేదు. ఒకరు నాటికగా మలుచుకుంటామన్నారు.

**ప్ర: కథగా రావలసిందే అని వెంటాడిన అంశాలు ఏమైనా ఉన్నాయా?**

జ: చాలా ఉన్నాయి. 2017లో ఢిల్లీలో నిఖిత ఆజాద్ అనే యువతి 'హ్యాపీ టు బ్లీడ్ అనే యాప్ తెరిచిన వార్త వింతగా, సాహసంగా తోచింది. స్త్రీల పీరియడ్స్‌కు సంబంధించిన విషయమది. చూడగానే దీనిపై కథ రాయాల్సిందే అనిపించింది. ఆ అంశంపై 'మరక మంచిదే' అని తెగించి రాశాను. ఆ కథ వచ్చాక 'ఏంటయ్యా.. మరీ ఇలా రాస్తారా!' అని మెచ్చుకోలుగా మాట్లాడిన మహిళలే అధికం. ఇలాంటి కథ ఓ మగాడు రాయడం చిత్రంగా ఉందన్నారు. ఈ కథ ఓ మహిళా మ్యాగజైన్‌లో వేసుకున్నారు. కన్నడంలోకి తర్జుమా అయింది.


అలాంటిదే మరో సంఘటన. మీరట్‌కు చెందిన ఒక తలారి కుటుంబం మూడు తరాలుగా ఖైదీలకు మరణశిక్ష అమలు చేస్తున్నదని ఓ ఇంగ్లీష్ పత్రికలో చదివాను. తమ చేతులతో ఉరితాడు ఖైదీ మెడకు బిగించి మీట నొక్కుతారు. విలవిలా తన్నుకొని ప్రాణాలు విడిచినవారి ముఖాలు, చూపులు వెంటాడుతాయట. సమాజం కిరాతకుడిగా చూసే ఈ కర్కశ వృత్తి తనతోనే ఆగిపోవాలని ఆయన వేదనతో అన్నారు. జైలు ఉద్యోగులే ఈ పనెందుకు చేయరనే కోణంలో 'ఈ శిక్ష మాకొద్దు' అనే కథ రాశాను. ఈ కథకు 'తెల్సా' అనే అమెరికా సంఘం కథల పోటీలో బహుమతి వచ్చింది.

**ప్ర: 'దారి తెలిసిన మేఘం' శీర్షిక ఆసక్తిగా ఉన్నది. ఆ కథలో అంత విశేషం ఏమున్నది?**

జ: 'దారి తెలిసిన మేఘం' కథ అంతా కల్పనే. ఢిల్లీ యూనివర్సిటీలో రీసెర్చ్ చేయడానికి వెళ్లిన హైదరాబాద్ అమ్మాయి సుజన. అక్కడ పరిచయమైన సలీమ్ కేంద్ర బిందువులుగా సాగే కథ ఇది. మతం కన్నా జీవితం గొప్పదని చెప్పాలని రాసిన ఈ కథ నేటి అవసరం. అందుకే, ఈ కథ పేరే సంపుటికి శీర్షికగా తీసుకున్నాను. ఇలా కదిలించిన విషయాలతో అడపా దడపా కథలు రాయడం. ఏడాదికి ఒకటి, రెండు పత్రికల్లో రావడం కొనసాగుతున్నది. వీటిలో కొన్ని కథల పోటీల్లో గెలిచాయి. మూడు కథలకు ముల్కనూర్ గ్రంథాలయం వాళ్లు బహుమతులిచ్చారు.

**ప్ర: నేడు వస్తున్న కథలపై మీ అభిప్రాయం?**

జ: నేడు రచయితలకు అందుబాటులో ఉన్న భిన్న సాహిత్య ప్రక్రియల్లో కథ, నవలల్లోనే సమాజాన్ని లోతుగా, వివరంగా విశ్లేషించడానికి వీలవుతుంది. కథల్లో చర్చించే అంశాలు మనిషి చుట్టే తిరుగుతాయి. కథారచన పేలవంగా ఉంటే ఎంత మంచి విషయమైనా తేలిపోతుంది. ఎంత గొప్పగా రాయగలిగినా ఎంచుకున్న కథా వస్తువు మనిషికి దూరంగా ఉంటే ప్రయోజనం శూన్యం. కొత్తగా కథలు రాస్తున్నవాళ్లలో అన్ని రకాలున్నారు. కథలు చదవడం వల్ల ఎవరికివారు తాము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం వెతుక్కోవచ్చని నా అభిప్రాయం.



దాసరి
నాగభూషణం



## చెట్లకే మాటలు వస్తే ట్రీ టూన్స్!


**భారత స్వాతంత్రోద్యమ సమయంలోనూ, తర్వాతా ఇంగ్లిషు జర్నలిజంలో ఎంతోమంది తెలుగు వాళ్లు ఎడిటర్లుగా ప్రకాశిస్తే; మరో దశలో మరెంతోమంది మలయాళీలు జాతీయ స్థాయిలో కార్టూనిస్టులుగా భాసించారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' తొలిదశలో ఖాసా సుబ్బారావు ఎడిటర్‌గా పనిచేసిన తెలుగు వ్యక్తి కాగా, తర్వాత ఇటీవల తెలంగాణ జర్నలిస్టు జీఎస్ వాసు మాత్రమే ఆ పత్రికకు ఎడిటర్ అయ్యారు. వీరిద్దరి మధ్య ఆరేడు దశాబ్దాల ఎడమ ఉంది. ఈ విషయం ఎంత ప్రత్యేకమైందో, కడప ప్రాంతానికి చెందిన సురేంద్ర 'ది హిందూ' ఆంగ్ల దిన పత్రికకు పాతికేళ్ల కార్టూనిస్టుగా సాగడం కూడా అంతే విశేషం.**

ఆంగ్ల దినపత్రికలలో కార్టూనిస్టులుగా రాణించిన తెలుగువారు ఇదివరకు పెద్దగా లేరు. ఈ మధ్యనే సుభాని, సురేంద్ర చెప్పుకోదగిన రాజకీయ వ్యంగ్య చిత్రకారులు. 2021లో పదవీ విరమణ చేసిన తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడిన సురేంద్ర ఇటీవల 'ట్రీ టూన్స్' అనే పుస్తకాన్ని వెలువరించారు. ఇంగ్లీషు చెట్టుకు కార్టూన్‌లోని 'టూన్'కు పెళ్లి చేస్తే 'ట్రీ టూన్స్' అనే మాట తయారవుతుంది. ఈ పుస్తకం చెట్లకు సంబంధించిన 54 కార్టూన్ల సమాహారం.

వీరు స్థూలంగా వీరి 'ది హిందూ' పత్రికలోని పొలిటికల్ కార్టూన్లకు సంబంధించి ప్రత్యేకత ఏమిటంటే వ్యాఖ్య చాలా చిన్నగానో లేక దాదాపు లేకుండానో ఉండేది. పొలిటికల్ కార్టూన్లు ఆ ప్రాంతానికి, ఆ దేశానికి, ఆ సమయానికి మాత్రమే సంబంధించినవి కాగా; ప్రస్తుతం సంకలనం చేసిన ఈ పర్యావరణం సంబంధించిన కార్టూన్లు వస్తుపరంగా, విలువపరంగా సార్వత్రికమైనవి. పొలిటికల్ కార్టూన్లు రాజకీయ చరిత్రను వ్యాఖ్యానిస్తే ఇటువంటి చెట్లకు సంబంధించిన కార్టూన్లు మనిషి చెట్టును ఎలా డీల్ చేస్తాడని చెప్తాయి.

చెట్లకు మాటలు వస్తే, మనసుంటే, ఆలోచనలుంటే.. అవి మనలాగే మసులుతాయా? కుర్చీగా మారిపోయిన తన మిత్రుడిని మరో చెట్టు పలకరిస్తే ఎలా ఉంటుంది? తన మిత్రుడైన సూర్యుడితో ఒక చెట్టు సెల్ఫీ తీసుకుంటే? తమ చెంత కూర్చుని ప్రేమ ఊసులు చెప్పుకొన్న జంటలు, తర్వాతి కాలంలో పెళ్లి చేసుకోవడంలో ఎంతవరకు విజయం సాధించారని ఆ చెట్లే పరస్పరం కబుర్లు చెప్పుకొంటే ఎలా ఉంటుంది?

పొలిటికల్ కార్టూన్లు ఐదారు వేస్తే ఎడిటర్లు వాటిలో ఏదో ఒకటి ఎంపిక చేసి దినపత్రికలో అలంకరించేలా దారివేస్తారు. అయితే మిగతా ఐడియాలకు కూడా అంతే స్థాయిలో కార్టూనిస్టు కష్టపడాల్సి ఉంటుంది. కనుక కార్టూనిస్టుకు పని తక్కువ ఉందని మిగతా వాళ్లు అనుకున్నా, ఆయన బుర్ర గీక్కుకుంటూ చాలా గింజుకోవాల్సి ఉంటుంది. అలాంటి జుట్టు పీకుడు సమయంలో తటాలున మెరిసి, చటుక్కున ఉబికి వచ్చిన ఓ కార్టూను ఈ కార్టూన్లన్నింటికీ కారణమని సురేంద్ర చెప్తున్నారు. దానికి సాక్ష్యంగా ఫేస్‌బుక్ ఉన్నది.




సురేంద్ర కార్టూన్లలో వ్యాఖ్య తక్కువ కనుక భాషతో సంబంధం లేకుండా ఎవరైనా ఎంజాయ్ చేయవచ్చు. ఈ 54 కార్టూన్లలో ఎక్కువ భాగం ఇంగ్లీష్‌వే అయినా, కొన్ని తెలుగు కార్టూన్లు కూడా ఉన్నాయి. అందుకే కావచ్చు పుస్తకం లోపల రచయిత అదే కార్టూనిస్టు మాట ఇంగ్లీషులో ఉండగా, వెనకట్ట మీద వివరణ క్లుప్తంగా తెలుగులో కనబడుతుంది. అయితే, ఈ కార్టూన్లన్నీ చూసిన తర్వాత చెట్లన్నీ మనుషుల్లాగానే ఎందుకు ఆలోచన చేస్తాయనే సందేహం నాకు మొదలైంది? దానికి ఈ కార్టూనిస్ట్ మాత్రం ఏం సమాధానం చెప్పగలరు? అయితే మొత్తానికి ఈ కార్టూన్లన్నీ ప్రకృతి పట్ల, పర్యావరణం పట్ల మన అవగాహనను కచ్చితంగా పెంచుతాయి. ■



డాక్టర్ నాగసూరి
వేణుగోపాల్
94407 32392



## గుండె కింద...

ఏండ్ల తరబడి
ఎదురుసూపుల దర్వాజకు
యాలాడిన దోర్నపాలకుల
ఆకుపచ్చని ఆశ
ఆవిరయి ఎండిపోయింది
మనసును విడిచిపోని
పేగుబంధాన్ని
దగ్గరగా చూసుకొని చూసుకొని
కనిపెంచిన కండ్ల
దూరపు చూపు మందగించింది

ఎప్పుడన్నా ఒక్కసారి
చెవ్వానించి విన్నవో లేదో గానీ
ఇప్పటికీ ఊరి పిలుపు
గుండె కింద వినిపిస్తది

ఇయ్యాల నీకు గుర్తున్నదో లేదో
ఊరంటే
నా బంగారు కొండ అని
గుండెలకత్తుకొని
ఊపిన ఉయ్యాల
నీ చినిగిపోయిన నెక్కరు
వయసు ఆటల్లో
అరిగిపోయిన జారుడు బండ

ఎల్లిపాయకారం తిన్నా
కన్న కడుపు
ఎంత తీపి ప్రేమతోని పెంచిందో
మమకారం కరువైన రోజుల్లో
మాటిమాటికి యాదికొచ్చేది
నిజం కాదా?

పై చదువుల కోసం
పైసా పైసా కూడబెట్టిన
తండ్రి కాళ్ళు
భరించిన ముండ్లెన్నో
నీ సుకుమారపు
సాఫ్ట్‌వేర్ బుర్రకు
ఎప్పటికీ అంతుచిక్కని
లెక్క కాదా?

లగ్జరీ బస్సెక్కేదాకా
నాయిన భుజాల మీదనే లగేజీ
నీ బరువు నువ్వు
మొయ్యడానికి
పరువు అడ్డమొచ్చిందా
సోమరి తండ్రీ!
చదివిన సదువు
శరీరాన్ని బలహీనం
చేసిందా సుకుమారుడా!

నగరపు రోడ్డు దాకా
నిన్ను మోసిన బాధ్యత
గతుకుల బతుకు దారిలో
నడిచీ నడిచీ
అలిసిన పాదాల పగుళ్ళకు
మెత్తని చెప్పులు కొనియ్యని
ఉన్నత ఉద్యోగం
నాన్న గొప్ప పేరును మాత్రం
ఊరిజెండాపై
ఎగరేసిందా!?

నీ వైట్ కాలర్ ఉద్యోగానికి
ఖరీదైన బట్టల కింద
దాచినా దాగని
గర్వపు మురికి!

ఇంకా ఇంకా
బండబారిపోక ముందే
గుండె లోతుల్ల ఎక్కడన్నా
కొంచెం తడి
తగులుతుందేమో
తడుముకొని చూడు
నిన్ను నువ్వు ఉతుక్కోవడానికి!



రహీమొద్దీన్
90108 51085

**సునిశిత విమర్శకు పేరున్న వంశీకృష్ణ వర్తమాన విమర్శ చుట్టూ వ్యాసాన్ని నడిపి సినిమా హీరోలకి మల్లే కవులకి ఇమేజి సమస్యలున్నాయేమో అని వాపోవడం (చెలిమె 20.01.25) ఆశ్చర్యం వేసింది. ఆ పోలికే అసమంజసంగా ఉంది. ఇమేజులు అభూత కల్పన కాదా ? పైగా అతనెవరో (?) వర్ధమాన విమర్శకురాలు నీలిమ సదరు విమర్శను కూడా దూకుడు తగ్గించమన్నందుకు ఏకంగా తెలుగు సాహిత్య ప్రతిబింబంలా కనిపించాడన్నారు. ఇది మరీ దారుణమైన మాట. ఏ రకమైన చూపు ఇది ? విమర్శ మీద ప్రేమకొద్దీ ఆ అనామక మిత్రుడలాంటి మాట అని ఉండడు.**

## సాహిత్యాభిలాషను విమర్శ బ్రతికించాలి



ముందుమాటలు, బ్లర్బులు ఇలానే ఉండాలని ఏ సూత్రీకరణ లేదని చెప్తూనే వంశీ ఒక చోట పరిమితులుంటాయంటారు, మరొక చోట విమర్శ చేయకూడదని ఎక్కడా లేదు అంటారు. కొంతమంది కొత్త తరం రచయతల్ని ఉటంకిస్తూ వాళ్ళందరూ ఏ నెగెటివ్ విమర్శ (?) చేయడం లేదంటారు. వంశీకృష్ణ మాత్రం ఏ నెగెటివ్ విమర్శ చేసినట్టు భావించాలి? 'తెలుగు సాహిత్యం ఏమి కోరుకుంటున్నదో అదే నేను ఇస్తున్నాను' అన్న ప్రసేన్ వైపు సానుకూల ధోరణినే ఆయనా ప్రదర్శించాడు. పైగా వర్తమాన విమర్శకులు సేఫ్ గేమ్ ఆడుతున్నారంటాడు. ఆ ఆటకారితనం మనకి కొత్తదేం కాదు. ఎప్పుడూ ఉన్నది. దాన్ని పరిహరించాకే ఇన్నేళ్ళు తెలుగు సాహిత్యం అసలు విమర్శ సామర్థ్యాన్ని అంచనా వేస్తూ వస్తున్నది. లేకపోతే రారాలు, చేరాలని ఒకే గాటన కట్టేసినా తేడా తెలియకుండాపోను.

ఆ శేషం లక్ష్మీపతిరావు గారెవరో గానీ, ఆయన ప్రతిపాదించిన సాహిత్యంలో రిజర్వేషన్ తోడ్పాటు ఇప్పటికే కాదు, ఎప్పటికీ అవసరమే. అసమానతలు కొనసాగిన ప్రతి సమాజానికీ ఆ కాస్త సహేతుకత్వం ఉండతగినది. అదేమీ సానుభూతి కాదే? అయితే ఏదీ మరీ కళ్ళు మూసుకుపోయేట్టు ఉండకూడదు. గుంటూరు లక్ష్మీనరసయ్య గారు అణగారిన వర్గాల సాహిత్యం పట్ల ఎంతో ఔదార్యం చూపిస్తాడు. అతని సమర్థింపు ఒక తరం దళిత బహుజన రచయితలకు ఎనలేని ధైర్యాన్ని ఆత్మ విశ్వాసాన్నిచ్చిందనడంలో అతిశయోక్తి లేదు. ప్రాంతీయ విబేధాలు వచ్చినప్పుడు కూడా ఆయన మార్జినలైజ్డ్ ప్రజల పక్షాన్నే మాట్లాడాడు. కానీ ఆయన దళిత బహుజనేతరుల్ని ట్రీట్ చేసే పద్ధతిని మాత్రం సమర్థించకూడదు. పక్షపాతానికీ ఒక న్యాయం ముఖ్యం. విమర్శలోనూ అంతర్గత సమతుల్యత ఉంటుంది. వంశీకృష్ణ బహుజన, స్త్రీవాద, దళిత, ముస్లిం మైనారిటీ, ఆదివాసీ కవిత్వంపై ఇప్పటిదాకా వచ్చిన విమర్శని సరి అయిన విమర్శ కాదని భావిస్తున్నట్టు తోస్తున్నది.

వంశీకృష్ణ నీలిమను సమర్థించడానికే ఈ వ్యాసం రాసుకుంటే ఇబ్బంది లేదు. ఆ క్రమంలో అనిల్ డ్యానీ, లండ సాంబమూర్తి, నాంపల్లి సుజాత వంటి వారిని పరోక్షంగా తక్కువచేసి మాట్లాడారు. ఇప్పుడు వస్తున్న సాహిత్యంలో ప్రగతి కాముక రచనలతో బాటు నీతి ప్రవచనాలు, మితిమీరిన ఆధ్యాత్మిక భావజాలము, ఆచరణ లేని ఆదర్శ ప్రభోదాలు, హేతుబద్ధతలేని ప్రణయ ప్రస్తావనల వెల్లువ మనం అందరమూ గమనిస్తూనే ఉన్నాము. ఎవరి విమర్శ ఎలా ఉందో ఏ ఒక్కరి వకాల్తా అన్నింటినీ తేల్చేయదు. మిగతా ప్రక్రియలకున్నట్టే సద్విమర్శకీ విలువ ఉంది. తిట్టడమే విమర్శ అన్నట్టు తయారైన పరిస్థితిని వంశీకృష్ణ వంటివారు తులనాత్మక వివేచన చేయాలి. ఆయన ఈ వ్యాసం రాశాక సామాజిక మాధ్యమాల్లో ఒకరెవరో కొత్తగా రాస్తున్న వాళ్ళని గాయపరిచేట్టు 'చెత్తని చెత్త అంటే చిన్నబుచ్చుకుంటే ఎలా' అని వ్యాఖ్యానించడం బాధాకరం. నీలిమ తన విమర్శను సరైన అర్థంలోనే చేసినట్టు యావత్ తెలుగు సాహిత్య సమాజం గుర్తించాలని వంశీకృష్ణ తాపత్రయపడుతున్నారు. అందుకు తన అనుభవజ్ఞ సమ్మోహ వాక్యం గట్టి ప్రయత్నమే చేసింది. తప్పు లేనే లేదు. ఆ మాత్రానికి విమర్శా రంగాన్ని శుభ్రపరుస్తున్న వ్యాఖ్యలు చేయనక్కర్లేదు. ఇమేజీ చట్రంలో చిక్కుకున్నారని కవుల్ని నిందించనక్కర్లేదు.



శ్రీరామ్ పుప్పాల
9963482597